క్లుప్తంగా

ఉమాకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



ఉమను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: ఉమా పార్లర్ అధినేత ఉమను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ఉమ కాలు తొలగించడంతో, మంత్రి బుధవారం గాజువాకలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, పార్టీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, సీఐ ఎల్.భాస్కరరావు ఉన్నారు.

యూపీహెచ్‌సీలో వసతుల పరిశీలన



రాంనగర్‌లోని యూపీహెచ్‌సీలో వసతులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది రాంనగర్‌లో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బుధవారం పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలతో పాటు ఫర్నిచర్, మెడికల్ కిట్లు, బెడ్స్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పది పడకలతో నిర్మించిన హెల్త్ సెంటర్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంద్రాన నూకరాజు, శ్రీహరి, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల అనుపు నేడు

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామ దేవతలు దుర్గమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల అనుపు ఉత్సవాన్ని గురువారం జరిపించనున్నట్లు శ్రీ వినాయక సాయి సీతారామ ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ నెల 12న ప్రారంభమైన ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయని చెప్పారు. గురువారం ఉదయం గ్రామంలోని సీతారాముల ఆలయం వద్ద అమ్మవార్ల ఘటాల ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. తిరువీధి అనంతరం ఘటాలను అమ్మవార్ల సన్నిధిలో ఉంచనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కామాడ రాంబాబు, వనమాడ అప్పలరాజు, ఎస్.అప్పలరాజు తెలియజేశారు.

తిరుమల బాలాజీ నేత్ర దర్శనం నేడు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం బాలాజీ నేత్ర దర్శనం ఉంటుందని ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ, శ్రీ తిరుమల బాలాజీ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి పారిశుధ్య కార్మికుల నిరసనలు

గాజువాక: జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నుంచి నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు. 67వ వార్డులోని పారిశుధ్య కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20, 21 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 27న ఒకరోజు టోకెన్ సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, సింహాచలం, దేవి, శ్రీను, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే 'జగనన్న సురక్ష'
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 85, 86 వార్డుల్లో ధ్రువపత్రాల అందజేత



86వ వార్డులో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



85వ వార్డులోని జగనన్న సురక్ష కార్యక్రమంలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజలకు మంచి చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఏ కారణం చేతనైనా అర్హత ఉండి మిగిలిపోయిన లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా మేలు జరుగుతుందన్నారు. 86వ వార్డు కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ పార్కులో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ప్రజల గడప వద్దకే అందిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటిని జల్లెడ పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 810 దరఖాస్తులు అందాయని, వాటిలో ఇప్పటికే 579 దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సర్టిఫికెట్లు అందించడం జరిగిందన్నారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షుడు మెడికల్ బాబు, చేగొండి శ్రీను, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, ఆర్పీలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించేందుకే..

అగనంపూడి: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు పరిధిలో దరఖాస్తుదారులకు బుధవారం ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల కొంతమందికి పథకాలు చేరడం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారని తెలిపారు. తండ్రి ఉద్యోగి కావడం వల్ల నిరుద్యోగి అయిన వివాహిత కుమారునికి పథకాలు అందడం లేదనే ఉద్దేశంతో అటువంటి వారి పేర్లు రేషన్ కార్డులో తొలగించి పథకాలకు అర్హత సాధించేలా చేశారన్నారు. పాలనను ప్రజల ముంగిటకే చేర్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై తెలుగుదేశం, జనసేన, వాటి తోక పార్టీలు విమర్శిస్తున్నాయన్నారు. వారి మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని, వాస్తవం తెలుసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, ఏపీడీ రాము, నాయకులు ప్రగడ వేణుబాబు, గెద్దాడ సత్యవతి, కొలిపాక అప్పారావు, యలమంచిలి అప్పారావు, దానబాల అప్పలనాయుడు, మామిడి శ్రీను, బోర సోమునాయుడు, ముద్దపు దామోదర్, దాసరి సత్యవేణి, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- 85వ వార్డులోని మంత్రిపాలెం, ఇ.మర్రిపాలెం, గెంజిపేట సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు ఇల్లపు వరలక్ష్మి దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ 776 మందికి ధ్రువపత్రాలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్-2 ఇల్లపు ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఒక్క రోజులో ధ్రువపత్రం



వాహనమిత్ర పథకానికి అర్హత ఉండడంతో వలంటీర్ కృష్ణ కుల ధ్రువీకరణ పత్రానికి నా చేత దరఖాస్తు చేయించారు. అన్ని పరిశీలించిన అధికారులు కేవలం ఒక్క రోజులోనే సర్టిఫికెట్‌ను జగనన్న సురక్ష క్యాంపులో అందజేశారు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా నేరుగా అందజేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మల్కి నానాజీ, రాసాలమ్మ కాలనీ

మాలాంటి వారికి వరం



వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత ఉండడంతో కుల ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేశాను. వలంటీర్ గీత ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు పత్రాన్ని నింపి తీసుకెళ్లారు. నేడు జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందజేశారు. ఇంత త్వరగా సర్టిఫికెట్ వస్తుందనుకోలేదు. జగనన్న సురక్ష కార్యక్రమం మాలాంటి పేదవారికి గొప్ప వరం. సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న మేలు మర్చిపోలేం.

– దుగ్గపు వాసుమ్మ, రాసాలమ్మ కాలనీ

3 రోజుల్లో క్యాస్ట్ సర్టిఫికెట్



కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడం వల్ల మా పాపకు అమ్మ ఒడి పథకం వర్తించలేదు. గతంలో దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే ధ్రువీకరణ పత్రం అందించారు. కృతజ్ఞతలు.

– వి.లక్ష్మి, సెక్టార్-2 కాలనీ

రెండు రోజుల్లోనే పరిష్కారం



దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమం వల్ల నేను ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాను. గతంలో సచివాలయంలో దరఖాస్తు చేసినా ఏ కారణం చేతనో మంజూరు కాలేదు. జగనన్న సురక్ష ద్వారా సమస్య పరిష్కారమైంది. సంతోషంగా ఉంది.

– బి.చిన్న కృష్ణారావు, కొండయ్యవలస

సేవా మూర్తులు

వలంటీర్లకు వందనం

అక్కిరెడ్డిపాలెం: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటి ముంగిటకే చేర్చుతున్న వలంటీర్ల సేవలు ఎనలేనివని లబ్ధిదారులు కొనియాడుతున్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించి, దరఖాస్తు చేయిస్తూ సచివాలయాలకు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసిస్తున్నారు. తమ పరిధిలోని కంటి వెలుగు పరీక్షలు, వైద్యశిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాల గురించి తెలియజేసి ఎంతో సహకారం అందిస్తున్నారని తెలియజేస్తున్నారు. అన్ని విధాలుగా సేవలు అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

వలంటీర్ కాదు కూతురే..



ఒకటో తేదీ వస్తే చాలు వలంటీర్ సత్యవతి ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తోంది. వలంటీర్ అంటే నాకు తెలియదు కానీ సత్యవతి వచ్చి అమ్మా బాగున్నావా, ఆరోగ్యం ఎలా ఉంది అంటు ఆప్యాయంగా పలకరిస్తుంటే సొంత కూతురిలా అనిపిస్తుంది. గతంలో మేము పింఛన్ తీసుకునేందుకు ఎన్నో కష్టాలు పడేవాళ్లం. ఇప్పుడు వీళ్లు ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తూ మాలాంటి వారికి ఎంతో సాయం చేస్తున్నారు.

– రమణమ్మ, అక్కిరెడ్డిపాలెం

ఆమే స్వయంగా దరఖాస్తు చేయిస్తుంది



నాకు ఈబీసీ నేస్తం వర్తించింది. వలంటీర్ మా ఇంటికి వచ్చి ఈ సంక్షేమ పథకం గురించి చెప్పింది. దగ్గరుండి దరఖాస్తు చేయించింది. అవసరమైన సర్టిఫికెట్లు అడిగి తీసుకుని, ఆమె ఫారం నింపింది. కార్యదర్శితో వివరాలు నమోదు చేయించి పథకం వచ్చేలా చేసింది. ఆమె ఎంతో సాయం చేస్తోంది.

– ఉమాదేవి, అక్కిరెడ్డిపాలెం

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌లో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న సత్యసాయి సమితి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జన్ భాగీదారి (కమ్యూనిటీ భాగస్వామ్యం)తో వన మహోత్సవం నిర్వహించారు. దైనందిన జీవనశైలిలో పర్యావరణ అవగాహన, పచ్చదనం ప్రాముఖ్యతను పెంపొందించడానికి ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో ప్రగతి మైదాన్ మెడ్‌టెక్ జోన్‌కు వెళ్లే రహదారిలో 700 కోనోకార్పస్ మొక్కలను నాటారు. అదే విధంగా సత్యసాయి సేవా సమితి, జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు 500 మొక్కలు నాటారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

- కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో బుధవారం మొక్కలు నాటారు. విభాగాధిపతి పి. శ్రీనివాసులు ,హెచ్‌ఆర్ అధికారులు కె. తిరుమలరావు, సుబ్రహ్మణ్యం, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో మొక్కలు నాటారు. ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో విభాగాధిపతి కార్యాలయం వద్ద విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, జీఎంలు పాండే, మిశ్రాలు, డీజీఎం ముఖోపాధ్యాయ మొక్కలు నాటారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశ అభివృద్ధి

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 888వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్ర్యం అనంతరం నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశం అభివృద్ధి పథంలో ఉందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, కార్మికుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టవద్దని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 888వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, విశాఖ ఉక్కు సంస్థపై పెట్టుబడి పెట్టి, పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సేఫ్టీ ఎగ్జిబిషన్ ప్రారంభం



సేఫ్టీ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న భద్రతా విభాగాధిపతి రామ్‌ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద బుధవారం సేఫ్టీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మెసర్స్ ఉద్యోగి సేఫ్టీ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యక్తిగత రక్షణ, అత్యవసర రెస్క్యూ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రియాలిటీ ఆధారిత శిక్షణ డెమోలు, ఎమర్జెన్సీ రెస్క్యూ డెమోలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉక్కు భద్రతా విభాగాధిపతి దువ్వాడ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పీపీఈల వినియోగాన్ని ప్రోత్సహించడానికి, తాజా రెస్క్యూ పరికరాలపై అవగాహన తీసుకువచ్చేందుకు ఈ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందన్నారు. భద్రతా విభాగం డీజీఎం ఎం. వరప్రసాద్, మేనేజర్ ఐ. వర్గీస్ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, ట్రైనీలు, కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంవీఆర్‌లో యోగా కోర్సులకు ఏయూతో ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను అందజేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో పదేళ్ల పాటు యోగా తరగతుల నిర్వహణకు ఆ కళాశాల యాజమాన్యం ఆంధ్రా యూనివర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఏయూ వీసీ పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సమక్షంలో బుధవారం కుదుర్చుకున్న ఈ ఒప్పందం ప్రకారం ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం యోగాలో డిప్లమా కోర్సును, రెండో ఏడాది నుంచి యోగాలో పీజీ డిప్లమా కోర్సును నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. ఏయూ పరిధిలోని యోగా కోర్సులను ప్రవేశపెట్టనున్న కళాశాలల్లో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల మొదటిదని పేర్కొన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, రెక్టార్ కె.సమత, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.రమేష్, యోగా విలేజ్ హెడ్ ప్రొఫెసర్ కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేయాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న గొందేశి సత్యారావు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు గొందేశి సత్యారావు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఉక్కు నిర్వాసితుల సంఘం ప్రతినిధులతో కలసి బుధవారం సందర్శించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ, గొందేశి సుమన్ రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, ప్రభాకర్ రెడ్డి, జగదీష్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో సీసీఎస్ ప్రతినిధులు ఎస్.వి.రమణ, బి.ఎస్.ఎన్.రాజు బుధవారం ఆరో రోజు దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బస్సులకు స్పేర్ పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, సిక్ అయిన సందర్భంలో రోజుల తరబడి విధులకు తీసుకోకుండా వేధించే విధానం విడనాడాలని, ఓటీ, నైట్ షిఫ్ట్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో డి.వి. సత్యవతి, ఎం.ఎం. కృష్ణ, కె.సీహెచ్. రావు, ఆర్.వి. మూర్తి కూర్చున్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించండి

రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్వో లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల నమోదుకు, ఓటర్ల జాబితాల్లోని మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి కోరారు. గాజువాకలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ లెవల్ అసిస్టెంట్ (బీఎల్ఏ)ను నియమించాల్సి ఉందన్నారు. అయితే, ఏ పార్టీ ఇప్పటివరకు నియమించలేదన్నారు. దీనికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఫారం 1డీ బీఎల్ఏ1, ఫారం 1డీ బీఎల్ఏ 2 పత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల పేర్లు, ఏఈఆర్‌వోల పేర్లు, ఫోన్ నంబర్ల జాబితాలను అందజేశారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన సర్వే వివరాలను వెల్లడించడంతో పాటు మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాలను నాయకులకు అందజేశారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఏడు రోజుల్లో తెలపాలని కోరారు.

జీరో డోర్ నంబర్‌తో 62 మంది ఓటర్లు

నియోజకవర్గంలోని సున్నా డోర్ నంబర్‌తో 62 మంది ఓటర్లున్నట్టు గుర్తించినట్టు ఈఆర్వో లక్ష్మారెడ్డి తెలిపారు. ఇలాంటి పేర్లు ఇంకా ఎవరైనా ఉంటే గుర్తించాలని కోరారు. ఒకే ఇంటి డోర్ నంబర్‌లో పది మంది కంటే ఎక్కువ ఓటర్లున్న ఇళ్లకు సంబంధించిన విచారణ పూర్తయిందని తెలిపారు. వాటి సవరణ చేపట్టామని పేర్కొన్నారు. గాజువాకలో షెల్టర్ లేని వ్యక్తులను గుర్తించడంలో సహాయ పడాలని కోరారు. 31 మంది ట్రాన్స్‌జెండర్లను గుర్తించామని, వారిని ఓటర్లుగా నమోదు చేయడానికి సహకరించాలని కోరారు. యువ ఓటర్ల నమోదుకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ పద్మజ, ఏసీపీ మహాపాత్రో, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్టీల్‌క్లబ్ వార్షికోత్సవం



వార్షిక వేడుకల్లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకలను క్లబ్ చీఫ్ పేట్రన్, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యుల మానసిక ఉల్లాసం కోసం ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. అధికారుల మానసిక ఉల్లాసం కోసం యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందన్నారు. క్లబ్ కార్యదర్శి జి. నారాయణ దొర మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వార్షిక వేడుకలు ప్రారంభించామన్నారు. హిట్ మూవీల ప్రదర్శన, ఇన్‌హౌస్ టాలెంట్ పోటీలు, మెగా హౌసీ నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ జీఎం ఎం.మధుసూదనరావు, సన్ గ్రీన్ సంస్థ సీఈవో కె.శృతి, క్లబ్ కోశాధికారి ఆర్. సత్యనారాయణ, కమిటీ సభ్యులు కుంచా సత్యనారాయణ, పెంటకోట రామకృష్ణ, రవీంద్రబాబు, వీరాస్వామి, రవికుమార్, కె.ఎల్. నర్సింహం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు 22న పాదయాత్ర



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 22న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో జింక్ గేటు నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నామని కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. 76వ వార్డు నడుపూరులోని ఉక్కు కళావేదికలో ఉక్కు నిర్వాసితులు, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, అలాగే అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, ఏఐసీసీ మెంబర్ వేగి వెంకటేష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, నిర్వాసిత నాయకులు పితాని భాస్కరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.